పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జేసీ

విజయనగరం కలెక్టరేట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సీతం కళాశాల సమీపంలోని అయాన్ డిజిటల్‌లో ఏర్పాటు చేసిన లెక్చరర్ పోటీ పరీక్షల కేంద్రాన్ని జేసీ సేతుమాధవన్ మంగళవారం తనిఖీ చేశారు. ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. అభ్యర్థులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు ఉండాలని సిబ్బందికి జేసీ సూచించారు. ఎటు వంటి అవకతవలకు తావవ్వకుండా పకడ్బందీగా పరీక్షలను నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట విజయనగరం తహసీల్దార్ కూర్మనాథరావు ఉన్నారు.

విశ్వసనీయత.. నిబద్ధత



- అందరి మన్ననలు అందుకున్న అశోక్‌గజపతిరాజు
- గోవా గవర్నర్‌గా నియమించడంతో సర్వత్రా హర్షం
- జిల్లా రాజకీయాల్లో నాలుగు దశాబ్దాల చెరగని ముద్ర
- ఆది నుంచి టీడీపీ వెన్నంటే.. అభివృద్ధిలో కీలక పాత్ర

విజయనగరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి)

అశోక్‌గజపతిరాజు గవర్నర్ అయినందుకు సంతోషం.. రాజకీయాల నుంచి తప్పుకుంటున్నారని తెలిసి బాధ.. ఒకేసారి ఆయన అభిమానులకు కలిగిన భావోద్వేగాలివి. అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులైన విషయం తెలిసి టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. తాను ఏస్థాయిలో ఉన్నా.. ఎలాంటి అత్యున్నత పదవులు చేపట్టినా విజయనగరం గడ్డను మరువనంటూ ఆయన చేసిన ప్రకటనపై జిల్లా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆది నుంచి టీడీపీ వెంటే..

తెలుగుదేశం పార్టీతో అశోక్‌గజపతిరాజుది విడదీయరాని బంధం. 1982 మార్చి 28న నందమూరి తారకరామారావు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ వేదికగా తెలుగుదేశం పార్టీని ప్రకటించారు. అప్పుడు ఎన్టీఆర్ వెంట ఉన్నది అశోక్‌గజపతిరాజు. ఆయన పార్టీ వ్యవస్థాపక సభ్యుడు కూడా. 43 ఏళ్ల సుదీర్ఘ టీడీపీ ప్రస్థానంలో అశోక్ ఎన్నడూ పార్టీ గీత దాటలేదు. ఆయనకు పార్టీ అన్నీ ఇచ్చింది. ఆయన సైతం పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేశారు. వాస్తవానికి సామాజికవర్గపరంగా రాజకీయాలు నడుస్తాయి. విజయనగరం జిల్లాలో ఆ పరిస్థితి రాలేదు. రెండు బలమైన సామాజికవర్గాలను సమన్వయం చేసుకుంటూ ఆయన ముందుకు సాగారు.

రాజకీయ కుటుంబమే..

అశోక్ తండ్రి పీవీజీ రాజు ఎంపీగా ఉండేవారు. సోదరుడు ఆనందగజపతిరాజు విశాఖ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా గెలిచారు. అశోక్ తొలిసారిగా 1978లో జనతా పార్టీ తరఫున అసెంబ్లీకి పోటీచేసి గెలిచారు. జాతీయ కాంగ్రెస్, ఇందిరా కాంగ్రెస్, స్వతంత్ర, జనతా పార్టీలు పోటీ చేయగా చతుర్ముఖ పోటీలో అశోక్ గజపతిరాజునే విజయం వరించింది. అనంతరం ఎన్టీఆర్ పిలుపు మేరకు అశోక్ టీడీపీలో చేరారు. 1983 ఎన్నికల్లో (మిగతా 6వ పేజీలో..)

ఇంటి ప్లాన్‌కు లంచం

- అనుమతి ఇచ్చేందుకు రూ.20వేలు డిమాండ్
- ఏసీబీకి చిక్కిన నెల్లిమర్ల కమిషనర్
- రూ.15వేలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా..



ఏసీబీకి చిక్కిన కమిషనర్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమ్య

నెల్లిమర్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారక్‌నాథ్ మంగళవారం ఏసీబీకి పట్టుబడ్డారు. పట్టణంలోని పద్మశాలివీధిలో నివశిస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి ఇంటి నిర్మాణానికి ప్లాన్ అనుమతి కోసం లంచం డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో తన గదిలో రూ.15వేలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ రమ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని పద్మశాలివీధిలో నివశిస్తున్న బురడి మహేష్ అదే వీధిలో ఇల్లు నిర్మించుకుంటున్నాడు. ఆ ఇంటికి ప్లాన్ అనుమతి కోసం ఇటీవల పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. అనంతరం కమిషనర్ తారక్‌నాథ్‌ను సంప్రదించాడు. అనుమతి కావాలంటే రూ.20వేలు లంచం ఇవ్వాలని కమిషనర్ డిమాండ్ చేశారు. రూ.15వేలు నగదు రూపంలో మిగిలిన రూ.5వేలు దివాన్ కాట్ బెడ్ కోసం ఇవ్వాలని కోరారు. ప్లాన్ కోసం అవసరమైన ఫీజు చెల్లించానని, లంచం ఇవ్వలేనని మహేష్ ప్రాధేయపడ్డాడు. అయినా సరే కమిషనర్ అంగీకరించలేదు. దీంతో మహేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో నగర పంచాయతీ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌కు వెళ్లిన మహేష్ రూ.15వేలు అందజేశారు. లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమ్య (మిగతా 6వ పేజీలో..)

స్వామీ ఇంత దైన్యమేమీ?



వేణుగోపాల స్వామి ఆలయం

స్వామివారి మూలవిరాట్

- 470 ఎకరాలు అన్యాక్రాంతం
- బ్యాంకుల్లో ఆభరణాలు
- నిర్వహణకు అర్చకుల అవస్థలు
- దేవదాయశాఖ ఉన్నతాధికారులు స్పందిస్తేనే
- దయనీయంగా వేణుగోపాలస్వామి ఆలయం

బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయం అంటే ఎంతో ప్రఖ్యాతి. జిల్లాలో ప్రత్యేక గుర్తింపు ఉన్న క్షేత్రం. నిత్యం భక్తులు దర్శించే స్థలం. పర్యాటకులు సందర్శించే ప్రాంతం. అలాంటి ఆలయం కొన్ని ప్రాధాన్య రోజులలో మినహా దయనీయంగా ఉంటోంది. అపారమైన ఆస్తులు, సంపదలున్నా స్వామికి నైవేద్యం పెట్టేందుకు ఆలయ అధికారులు, అర్చకులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా స్వామికి 499.17 ఎకరాలతో పాటు మణులు, మాణిక్యాలు, ఆభరణాలున్నాయి. కానీ వీటిని స్వామి వారు అందుకోలేని పరిస్థితి నెలకొంది. స్వామి భూముల్లో సుమారు 470 ఎకరాలు అన్యాక్రాంతంలో ఉండగా, ఆభరణాలు బ్యాంకుల్లో నిక్షిప్తమై ఉన్నాయి.


బొబ్బిలి, జూలై 15(ఆంధ్రజ్యోతి)

బొబ్బిలి సంస్థానాదీశులు 1857వ సంవత్సరంలో సుమారు ఐదెకరాల్లో నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయం అద్భుతమైన శిల్పకళాసంపదతో అలరారుతుండేది. స్వామి దర్శనానికి వేలాదిగా భక్తులు వచ్చేవారు. నిత్యం అనేక రకాల పూజలు జరుగుతుండేవి. కాలక్రమంలో ఆలయం పరిస్థితి గాడి తప్పింది. నిర్వహణకు సైతం ఇబ్బందులు పడే దుస్థితి దాపురించింది. ప్రధానంగా భూముల నుంచి ఆదాయం వచ్చి ఉంటే అనేక సమస్యలు ఉండేవి కావు. కానీ ఆక్రమణలతో ఉన్న భూములనే ఆలయం కోల్పోతోంది. అన్యాక్రాంతంలో ఉన్న వాటిని గుర్తించేందుకు జిల్లా దేవదాయశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నా స్పందన ఉండడం లేదు. ఆలయ భూములు అజ్జాడ గ్రామంలో 474.81 ఎకరాలు, గొల్లపల్లిలో 10.27 ఎకరాలు, పాతబొబ్బిలిలో 9.04 ఎకరాలు, ఎంబనవలసలో 3.65 ఎకరాలు, నారాయణపురంలో 1.40 ఎకరాలున్నాయి. ఈ భూములన్నింటిలో కేవలం మూడెకరాలపై ఏడాదికి ఆరేడు వేల రూపాయలు వస్తోంది. అజ్జాడ భూముల్లో సుమారు 470 ఎకరాలు అన్యాక్రాంతంలోనే ఉన్నాయి. వారి చెరనుంచి భూములను స్వాధీనం చేసుకునేందుకు దేవదాయ శాఖాధికారులు చేస్తున్న ప్రయత్నాలన్నీ దశాబ్దాలుగా విఫలమవుతూనే ఉన్నాయి.

- రెండేళ్ల క్రితం దేవదాయశాఖ ఉన్నతాధికారులు అజ్జాడ గ్రామానికి వెళ్లి భూములను సాగుచేసుకుంటున్న వారికి అవగాహన కల్పించి ఆదాయంలో ఎంతో కొంత ఆలయానికి ఇవ్వాలని కోరారు. కోర్టులు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేశాయని వారికి నచ్చజెప్పారు. అప్పటికి సరే అన్న వారంతా ఆ తరువాత ససేమిరా అన్నట్లు వ్యవహరిస్తున్నారు. దర్శన టిక్కెట్లు, కొద్దిపాటి భూమి శిస్తు ద్వారా ఆలయానికి ఏడాదికి ఏడున్నర లక్షల రూపాయల వరకు ఆదాయం సమకూరుతున్నప్పటికీ దీనిపై మరో లక్షన్నర రూపాయలకు పైగా ఆలయ నిర్వహణ ఖర్చులవుతున్నాయి.
- ఆలయ ట్రస్టీగా రాజవంశీయులు, మాజీ మంత్రి ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావు వ్యవహరిస్తున్నారు. వ్యవస్థాపక ట్రస్టీగా ఆయన తండ్రి (మిగతా 6వ పేజీలో..)

ఆ మూడింటితో అవస్థలే

- మురుగుమయమైన కళింగెడ్డ
- దుర్గంధం వెదజల్లుతున్న కుళ్లికోనేరు
- వరదతో నిండిపోతున్న విశాఖ-అరకు రోడ్డు
- స్వచ్ఛాంధ్ర సాకారానికి దూరంగా ఎస్.కోట



చెత్తా చెదారంతో కుళ్లికోనేరు

ఎస్.కోట పట్టణం మధ్య నుంచి వెళ్లే కళింగెడ్డ మురుగుతో నిండిన దృశ్యం

విశాఖ-అరకు రోడ్డులో నిలిచిన వరద నీరు

శృంగవరపుకోట, జూలై 15(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పట్టణ మధ్యలో ఉన్న కళింగెడ్డ (జగ్గుచెరువు సాగునీటి కాలువ) పూర్తిగా మురుగుతో నిండిపోయింది. పొదలు, చెత్తా, చెదారం, ప్లాస్టిక్, గాజు వస్తువులతో దోమలకు ఆవాసమైంది. ఇరువైపులా ఉన్న నివాసాలకు నిత్య నిరకం చూపిస్తోంది. చిన్నపాటి చినుకులు పడినా ఇందులోని మురుగంతా ఇళ్లల్లోకి వచ్చేయడంతో వర్షాకాలమంటేనే స్థానికులు వణుకుతున్నారు. సాగునీటికి బదులు రోగాలను మోసుకొస్తోంది. కుళ్లికోనేరుదీ ఇదే దుస్థితి. వ్యవసాయ భూములకు సాగునీరు అందించే బంద మురికికుపంగా మారడంతో కుళ్లికోనేరుగా పేరొందింది. ఇక విశాఖ-అరకు ప్రధాన రహదారిదీ ఇదే పరిస్థితి. వానొస్తే ఈ రోడ్డులో ప్రయాణం అవస్థే. వరద నీరు అధికంగా నిల్వ ఉండిపోతుంది. ఈ ముడు శృంగవరపుకోట పట్టణ స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర సాకారానికి అడ్డంకిగా మారాయి. అరకు పర్యాటక ప్రాంతానికి ముఖద్వారంగా ఉన్న ఈ పల్లె పట్టణం జిల్లాలోని మేజర్ పంచాయతీల్లో పెద్దది కాగా అపరిశుభ్రతలో అట్టడుగున చేరుతోంది.

మూడు దశాబ్దాలుగా పెడదారి

70 ఏళ్ల క్రితం నుంచి నియోజకవర్గ కేంద్రంగా ఉన్న ఎస్.కోట పట్టణంలో మూడు దశాబ్దాల నుంచి సమస్యలు పీడిస్తున్నాయి. ఇక్కడ నుంచి చట్టసభలకు ప్రాతినిధ్యం వహించిన ప్రజాప్రతినిధులు, ఇక్కడ పనిచేసిన అధికారులు, ఇదే దారిలో అరకు పర్యాటక ప్రాంతానికి వెళ్తున్న ప్రముఖులెవరూ ఎస్.కోటను సీరియస్‌గా పట్టించుకోవడం లేదు. ఒకప్పుడు వందలాది ఎకరాలకు సాగునీరు అందించే కళింగెడ్డ పట్టణ పైభాగాన వున్న జగ్గుచెరువు నుంచి 15 అడుగుల పైబడిన వెడల్పుతో పట్టణం మధ్య నుంచి వెళ్తుంది. ఈ కాలువ దాదాపు 400 ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు మరిన్ని చెరువులకు అనుసంధానంగా (మిగతా 6వ పేజీలో..)

పాములను బతకనిద్దాం

- అన్నీ హానికరం కాదు
- కనిపించిన వెంటనే మట్టుబెడుతున్న జనం
- జీవ వైవిధ్యానికే ప్రమాదకరం
- నేడు ప్రపంచ పాముల దినోత్సవం

4

పాము కనిపిస్తే వెంటనే బెంబేలెత్తిపోయి దానిని అంతమొందించేందుకు ప్రయత్నిస్తుంటారు. వాస్తవానికి పామును మనం ఏమీ అనకపోతే అది హాని తలపెట్టబోదని స్నేక్‌స్నాచర్లు చెబుతున్నారు. జనావాసాల్లోకి పాములు ప్రవేశించినప్పుడు భయభ్రాంతులకు గురికాకుండా వాటిని దూరంగా ఉండి గమనించాలట. పాములను పట్టుకొని సురక్షిత ప్రాంతాల్లో విడిచిపెట్టే వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలను సంప్రదించాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ముఖ్యంగా రైతులు పొలం పనుల సమయంలో ఎదురయ్యే విషరహిత పాములను సైతం చంపేస్తున్నారు. అవి అంతరించిపోవడం వల్ల జీవ వైవిధ్యానికి విఘాతం కలుగుతోంది. పొలాల్లోని పంటలను ఎలుకలతో పాటు ఇతర కీటకాలు, జీవులు నాశనం చేస్తుంటాయి. ఆ సమయంలో పాములే వాటి భరతం పడతాయి. ఎలుకలపై దాడి చేయడంతో వాటి సంఖ్య నియంత్రణలో ఉంటుంది. పరోక్షంగా పంటకు రక్షణగా నిలుస్తాయి. ఈ విషయం తెలియని చాలామంది రైతులు పాములను అంతమొందిస్తున్నారు.





బొబ్బిలిలో భారీ వర్షం

బొబ్బిలిలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంటకు పైగా ఉరుములు, మెరుపులతో దంచి కొట్టింది. విరామం లేకుండా కుండపోతగా వాన పడడంతో ఎటు చూసినా నీరే కనిపించింది. పల్లపు ప్రాంతాలన్నీ చెరువుల్లా మారాయి. రహదారుల పైనుంచి కూడా అధికంగా నీరు ప్రవహించింది. మండుటెండలకు విలవిల్లాడుతున్న పట్టణ ప్రజలు ఈ వర్షంతో ఊరట చెందారు. ఇటు రైతులు కూడా నాట్లు వేసేందుకు సమాయత్తం కావాలని భావిస్తున్నారు. భారీ వర్షానికి బొబ్బిలిలోని ఎన్టీఆర్ బొమ్మ, కోవెల సెంటర్, కోరాడ వీధి రోడ్డులో అధికంగా నీరు చేరింది. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

- బొబ్బిలి/రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి):

పాములను బతకనిద్దాం

పాము... ఈ పేరు వింటేనే హడలిపోతాం. ఇక ఎదురుగా కనిపిస్తే అంతే సంగతులు. వాస్తవానికి పాము మనం కనిపించిన వెంటనే తనకు తానుగా వచ్చి.. కాటు వేసిన సంఘటనలు ఉండవనే చెప్పాలి. తనకు హాని కలుగుతుందని భావించిన సమయం లోనో... మన కాళ్ల కింద పడడం వల్లనో కాటు వేసిన సందర్భాలే అధికం. కానీ భయంకొద్దీ మనం వాటిని అంతమొందిస్తుంటాం. దీనికి భిన్నంగా కొందరు వ్యక్తులు ఎలాంటి సర్పాన్నయినా ఇట్టే పట్టుకొని... వాటికి ఎటువంటి హాని కలగకుండా...అదే సమయంలో మనుషుల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా సురక్షితంగా వాటిని అడవుల్లో విడిచి పెడుతున్నారు.

- అన్నీ హానికరం కాదు
- కనిపించిన వెంటనే మట్టుబెడుతున్న జనం
- అవగాహన లోపమే కారణం
- నేడు ప్రపంచ పాముల దినోత్సవం

రాజాం/విజయనగరం రింగురోడ్డు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పాము కనిపిస్తే అక్కడి నుంచి పారిపోవడమో... లేదా దాని ప్రాణాలకు హాని తల పెట్టడమో చేస్తుంటాం. దీనికి ప్రధాన కారణం మనలోని భయం. ఒక వైపు మనుషుల నుంచి పాములకు ప్రాణ హాని కలుగుతోంది. మరోవైపు అడవులు అంతరించిపోవడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకం అవుతోంది. పాముల సంతతి తగ్గుతోంది. దీని వల్ల పర్యావరణానికి ప్రమాదమని జీవశాస్త్ర పరిశోధకులు చెబుతున్నారు. పాముల ఆవశ్యకతను వివరించేందుకు.. వాటి మనుగడను కాపాడేందుకు అనేక స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. దీనిలో భాగంగానే ఏటా జూలై 16న ప్రపంచ పాముల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

ఎన్నో రకాలు..

జిల్లాలో అనేక రకాల పాములు ఉన్నాయి. నాగుపాము, కట్లపాము, జెర్రిపోతు, రక్తపింజర, చిన్నపింజర, నూనెకట్ల పాము, మట్టిపాము, రెండుతలల పాము, నీరుకట్ట, మంటిబుక్కుడం వంటివి ఎక్కువగా సంచరిస్తుంటాయి. వీటిలో నాగుపాము, రక్తపింజర, చిన్నపింజర, కట్లపాము అత్యంత విషపూరితమైనవని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో మైదాన ప్రాంతాల్లోనే ఎక్కువగా పాములు సంచరిస్తుంటాయి. ప్రధానంగా నాగావళి, చంపావతి, ఇతరత్రా నదులు, వాటి పరీవాహక ప్రాంతాల్లో పాములు ఎక్కువగా సంచరిస్తుంటాయి. నాగావళి తీరంలోని వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లో పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా వ్యవసాయ పనుల సమయంలో ఇవి రైతులకు కాటు వేస్తుంటాయి. ఏటా పాముకాటు బాధితులు 600 మంది వరకూ జిల్లాలో ఉంటారని గణాంకాలు చెబుతున్నాయి.

● అవగాహన లేక..

పాములపై ప్రజల్లో అవగాహన లేక ఎక్కువ మంది దాడులు చేసి చంపుతున్నారని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రైతులు పొలం పనుల సమయంలో ఎదురయ్యే విషరహిత పాములను సైతం చంపేస్తున్నారు. ఈ కారణంగా ఇప్పటికే చాలారకాల అరుదైన సర్పజాతులు అంతరించే దశకు చేరుకున్నాయి. పాములు అంతరించిపోవడం వల్ల జీవ వైవిధ్యానికి విఘాతం కలుగుతోంది. వ్యవసాయ సాగుపై కూడా పెను ప్రభావం చూపుతోంది. సాధారణంగా పొలాల్లోని పంటలను ఎలుకలతో పాటు ఇతర జంతువులు నాశనం చేస్తుంటాయి. ఆ సమయంలో పాములు వాటి భరతం పడతాయి. ఎలుకలపై దాడి చేయడంతో వాటి సంఖ్య నియంత్రణలో ఉంటుంది. పరోక్షంగా పంటకు రక్షణగా నిలుస్తాయి. కానీ ఇవి తెలియని చాలామంది రైతులు పాములను అంతమొందిస్తున్నారు.

● ఇలా చేయాలి..

జనావాసాల్లోకి పాములు ప్రవేశించినప్పుడు భయభ్రాంతులకు గురికాకుండా వాటిని దూరంగా ఉండి గమనించాలి. పాములను పట్టుకొని సురక్షిత ప్రాంతాల్లో విడిచిపెట్టే వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలను సంప్రదించాలి. వారికి సమాచారం అందిస్తే ...వచ్చి పాములను పట్టుకుంటారు. మనుషుల మాదిరిగానే పాములు భయపడతాయి. మనుషుల కదలికలను చూసి అతి వేగంగా స్పందిస్తుంటాయి. సురక్షిత చోటుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుంటాయి. అంతేకానీ మన మీద దాడి చేసేందుకు కాదన్న విషయాన్ని గ్రహించాలి. వీటిని గమనించి ఆచరిస్తే మాత్రం అటు పాములకు శ్రేయస్కరం. ఇటు జీవ వైవిధ్యానికి, వ్యవసాయ సాగుకు కూడా ఉపయోగకరం.




పాములను పట్టుకున్న స్నేక్ క్యాచర్ సాయికుమార్

● పాము మనుగడతో లాభాలు..

జీవ వైవిధ్యంలో పాములు కూడా ఒక భాగం. వాటి మనుగడతో చాలా రకాల ప్రయోజనాలు ఉంటాయి. ఇవి తెలియకుండా మనం మట్టుబెడుతుంటాం. పాముకు దగ్గరగా వెళితే దాని రక్షణ కోసం కాటు వేస్తుంది. అందుకే దూరంగా ఉండి గమనించాలి. అది విషపూరితమో.. విషరహితమో అన్న విషయాన్ని గ్రహించాలి. దానిని దారి మళ్లించాలి.

-బొత్స పైడియ్య, జంతు ప్రేమికుడు, రాజాం

● అన్ని పాములూ హానికరం కాదు..

అన్ని పాములు హానికరం కాదన్న విషయాన్ని గుర్తించాలి. పాములతో చాలా రకాల ప్రయోజనాలు ఉన్నాయి. కొన్నిరకాల పాముల విషాన్ని ఔషధాల తయారీకి సైతం వినియోగిస్తారు. పొలాల్లో పాములు ఉంటే పంటలకు రక్ష. ఎలుకలు ఎక్కువగా పంటను నాశనం చేస్తుంటాయి. ఆ సమయంలో పాములు ఉంటే ఎలుకలను తిని పంటను రక్షిస్తాయి. అందుకే పాములు ఎదురుపడితే దాడి కంటే వాటిని దారి మళ్లించడమే ఉత్తమం.

-కొండలరావు, డీఎఫ్‌వో విజయనగరం

సర్పాలను చంపవద్దు..

పాములు ఎక్కడైనా ఇళ్ల వద్ద కానీ.. బయట కానీ కనబడితే... చంపడం, కొట్టడం సమంజసం కాదు. మాలాంటి స్నేక్ క్యాచర్‌లకు సమాచారం ఇస్తే, వాటిని పట్టుకుని సురక్షితంగా అటవీ ప్రాంతాల్లో విడిచిపెడతాం. పాములపై ప్రేమతో ఈ వృత్తిని ఎంచుకున్నాను. స్నేక్ క్యాచింగ్‌లో మెలకువలునేర్చుకున్నాను. విజయనగరం జిల్లాలో నాగుపాములు ఎక్కువగా ఉంటాయి. నాగుపాముతో పాటు కట్ల పాములు ఎక్కువగా కనబడుతుంటాయి. వీటిని పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలిస్తున్నాం. పాములు పగబట్టడం అనేది ఉండదు. అది కేవలం అపోహ మాత్రమే. వాటికి హాని తలపెట్టకూడదు. జిల్లాలో విషం లేని పాములు ఎక్కువగా ఉన్నాయి. పాము కరిస్తే.. భయపడి చనిపోయేవారే ఎక్కువగా ఉన్నారు. అందుకే ముందుగా ప్రజలు ధైర్యంగా ఉండి... ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి. పాములు ఎక్కడ కనబడినా 9398663760 నెంబరుకు ఫోన్ చేస్తే, వాటిని పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెడతాం.

-బి.సాయికుమార్, స్నేక్ క్యాచర్, విజయనగరం



పైడిమాంబకు ప్రత్యేక పూజలు

విజయనగరం కల్చరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. రైల్వే స్టేషన్ వద్ద ఉన్న వనంగుడి, మూడులాంతర్లు వద్ద నున్న చదురుగుడిలో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పైడిమాంబకు వివిధ రకాల పువ్వులతో అర్చన చేశారు. వివిధ రకాల పండ్లు, పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. వనంగుడి, చదురుగుడుల్లో చండీయాగాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పైడిమాంబను పుష్పాలతో అలంకరించిన దృశ్యం



చండీయాగం నిర్వహిస్తున్న అర్చకులు

గుండంలో ఏనుగులు

సీతంపేట రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సీతంపేట, కురుపాం మండలాల సరిహద్దు ప్రాంతమైన గుండం గ్రామ సమీపంలో గజరాజులు సంచరిస్తున్నట్లు ఫారెస్ట్ బీట్ అధికారి దాలినాయుడు తెలిపారు. మంగళవారం ఏనుగుల గమనాన్ని పరిశీలించిన అటవీశాఖ సిబ్బంది... అక్కడ నివసిస్తున్న గిరిజనులను అప్రమత్తం చేశారు. ఏనుగులకు ఫోటోలు తీయడం... కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని ఆ గ్రామాల గిరిజనులకు సూచించారు. గజరాజుల సంచారాన్ని ఎలిఫెంట్ ట్రాకర్స్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



గుండం గ్రామ పరిసరాల్లో తిరుగాడుతున్న గజరాజులు



బత్తాయి, పైనాపిల్‌తో ముత్యాలమ్మకు అలంకరణ



తోగాలమ్మతల్లికి మొక్కజొన్న పొత్తులతో...

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ

భోగాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గుడివాడ గ్రామంలోని ముత్యాలమ్మ తల్లి, తోగాలమ్మతల్లి అమ్మవార్లను మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. బత్తాయి, పైనాపిల్, మొక్కజొన్న పొత్తులతో అమ్మవార్లను అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి.. భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి.. అమ్మవారిని దర్శించుకున్నారు.

తెలుగువారి ఖ్యాతి పెంచిన భవాని

విజయనగరం కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తన క్రీడా ప్రతిభతో తెలుగు వారి ఖ్యాతిని పెంచిన భవానీ ప్రతిభ అద్భుతమని జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ ప్రశంసించారు. కజకిస్థాన్‌లో జరిగిన జూనియర్ ఆసియన్ ఛాంపియన్‌షిప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వరుసగా 3 బంగారు పతకాలను సాధించిన కొండకరాం గ్రామానికి చెందిన క్రీడాకారిణి రెడ్డి భవానీని మంగళవారం జేసీ తన చాంబర్‌లో అభినందించారు. ఆమెకు క్రీడా ప్రాధికార సంస్థ తరఫున రూ.25 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.

భవానీ ప్రతిభ గర్వకారణం..

విజయనగరం దాసన్నపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వెయిట్ లిఫ్టర్ రెడ్డి భవానీ చూపిన ప్రతిభ తెలుగు ప్రజలకు గర్వకారణమని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. మంగళవారం కొండకరకాం గ్రామంలో రెడ్డి భవానీని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ ప్రతిష్ఠను ఇనుమడింప జేసిందన్నారు. భవానీ తల్లిదండ్రులకు తగిన సాయం అందించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. భవానీ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఆర్థిక సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు రామచంద్రరాజు, డి.కొండబాబు, నాగభూషణం, అప్పారావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.



భవానీని అభినందిస్తున్న జేసీ సేతు మాధవన్

రావాడ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

భోగాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): క్రీడల పోటీల్లో రావాడ హైస్కూల్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను దక్కించుకుంది. ఏపీ మోడరన్ పెంటాథియన్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ వచ్చినట్లు ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ తెలిపారు. గుంటూరు జిల్లా నరసరావుపేటలో ఈనెల 12, 13 తేదీల్లో ఏపీ మోడరన్ పెంటాథియన్ పోటీలు జరిగాయి. దీనిలో అండర్ 21 జూనియర్స్ విభాగం లేజర్ రన్‌లో రావాడ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి అవనాపు భీష్మ, రిలే రేస్ 3000 మీటర్లు, షూటింగ్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథముడిగా నిలిచి బంగారుపతకం సాధించాడు. వనుం సాయికిరణ్ అండర్ 17 విభాగంలో ఇదే పోటీలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రజతం పతకం అందుకున్నాడు. అవనాపు మేఘన, అప్రభుక్త నక్షత్ర, అవనాపు రక్షితలు ఫిమేల్ రిలేలో బంగారు పతకాలు సాధించారు. ఈ విద్యార్థులతో పాటు పీడీ సూర్యనారాయణను హెచ్‌ఎం అభినందించారు.

మహిళల భాగస్వామ్యంతో ప్రణాళికలు
● డీఆర్‌డీఏ పీడీ సావిత్రి

విజయనగరం కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి ప్రణాళికల రూపకల్పనలో మహిళలను భాగస్వాములను చేయాలని డీఆర్‌డీఏ పీడీ సావిత్రి అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో ఏపీఎంలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025-2026 సంవత్సరానికి గాను ప్రతి పంచాయతీ పరిధిలో ఎస్‌హెచ్‌జీ సభ్యులను, సమాఖ్యలను భాగస్వాములను చేయాలన్నారు. గ్రామసభల ఆమోదం తీసుకుని జీపీడీపీలో అనుసంధానం చేయాలని చెప్పారు. ఈ ప్రణాళికలో పేద, నిరుపేద కుటుంబాలకు అవసరమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, జీవనోపాధి కార్యక్రమాల అమలు, సామాజిక భద్రత, సహజ వనరుల అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు చిరంజీవి, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సావిత్రి



అమ్మవారిని కూరగాయలతో అలంకరించిన దృశ్యం

శాకంబరిగా జ్ఞాన సరస్వతి

పాలకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నక్కలపేటలో గల సకల దేవతల ఆలయంలో బుధవారం జ్ఞాన సరస్వతి అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు పర్రి శరత్‌కుమార్ ప్రత్యే క పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పల్లా కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా సారె ఊరేగింపు

భోగాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భోగాపురం గ్రామంలో మంగళవారం కనక దుర్గమ్మ సారెను ఘనంగా ఊరేగించారు. మాజీ ఉపసర్పంచ్ కొమ్మూరు సుభోషణరావు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆషాఢం సారెను సమర్పించారు. బ్యాండు వాయిద్యాలు, బాణసంచా మెరుపులు... నెమలి డ్యాన్సులు.. వేద మంత్రాలతో వందలాది మంది భక్తులు అమ్మవారిని ఊరేగించారు. కనక దుర్గమ్మవారి ఆలయ ఆవరణలో సారెను ఉంచి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంచిపెట్టారు.



నెమలి నృత్యం చేస్తున్న కళాకారులు



అమ్మవారికి సమర్పించిన సారె

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

భోగాపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ముంజేరు గ్రామంలో గల జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి మంగళవారం రెండు కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. సుమారు రూ.45వేలు విలువ గల చెక్కులను అందజేసినట్లు చెప్పారు. నాయకులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

మెరకముడిదాం, జూలై 15(ఆంధ్రజ్యోతి): సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ విభాగంలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 17వ తేదీలోగా జూనియర్ కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని, 18వ తేదీన విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

నేడు ఇంటర్వ్యూ

కొత్తవలస, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న జువాలజీ అధ్యాపక పోస్టును గెస్ట్ లెక్చరర్ ద్వారా భర్తీ చేస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.భీమశంకరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులు ఈనెల 16న ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

విజిలెన్స్ బృందం తనిఖీ

రాజాం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణంలో ఆంజనేయ ట్రేడర్స్‌ను విజిలెన్స్ బృందం మంగళవారం తనిఖీలు చేసింది. విజిలెన్స్ సీఐ టి.అప్పలనాయుడు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఎం.రామారావు ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టించవద్దన్నారు. అనంతరం ఏవో చీకటి రఘునాథ్ పొనుగుటువలస శ్రీరామ ట్రేడర్స్‌ను పరిశీలించారు.

చెడు అలవాట్లకు బానిస కాకండి

చీపురుపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎల్.దామోదరరావు కోరారు. మంగళవారం సాయంత్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల, మెట్టపల్లి, అలజంగి గ్రామాల్లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు లారీల స్వాధీనం

భోగాపురం, జూలై15(ఆంధ్రజ్యోతి): సుందరపేట సమీపంలో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ వైపు అధిక ఇసుక లోడుతో వెళ్తున్న నాలుగు లారీలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వి.పాపారావు మంగళవారం తెలిపారు. పట్టుకున్న లారీలను అపరాధ రుసుం విధించే విధంగా జిల్లా బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించామని చెప్పారు.

బుచ్చిఅప్పారావు విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు

జామి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు, జామి మండల వాసి గొర్రెపాటి బుచ్చిఅప్పారావు విగ్రహాన్ని గంట్యాడ మండలం తాటిపూడి రిజర్వాయర్ వద్ద ప్రతిష్ఠిద్దామని బీసీ సంఘ నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం జామిలోని వెలమ సంక్షేమ సంఘ ప్రతినిధి గొర్లె రవి నివాసంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు ఆధ్వర్యంలో వారు విగ్రహ ప్రతిష్ఠపై చర్చించారు. ఆయన జయంతి రోజున అక్టోబరు 13న విగ్రహాన్ని ప్రతిష్ఠిద్దామని నిర్ణయించారు.

25లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

రాజాం రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత హిందీ ప్రచారసభ(చెన్నై) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందీ పరీక్షల ఫీజు ఈనెల 25 లోగా చెల్లించాలని హిందీ ప్రచారక్ కొండవలస మధుసూధనరావు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరిచయ్, ప్రథమ, మధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ వరకు గల పరీక్షలు ఈ ఏడాది సెప్టెంబరులో జరుగుతాయని ఆయన చెప్పారు. మరిన్ని వివరాలకు 9949917365 నెంబరులో తనను సంప్రదించాలన్నారు.

రహదారి పూడ్చివేత తగదు

చీపురుపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జి.అగ్రహారానికి సమీపంలో ఉన్న జగనన్న కాలనీ, ఇందిరమ్మ కాలనీ రహదారిని పూడ్చి వేయడం ఎంతవరకు సమంజసమని కాలనీ వాసులు ప్రశ్నించారు. మంగళవారం వారంతా ఆందోళన వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలో సుమారు 700 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, వారందరికీ ఇదే రహదారిగా ఉందని తెలిపారు. పట్టణానికి చెందిన జనసేన నాయకుడు విసినిగిరి శ్రీనివాసరావు దౌర్జన్యంగా రహదారిని మూసి వేశారన్నారు. దారిని పూడ్చి వేసి, సుమారు 20 సెంట్లను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. రహదారిగా వినియోగిస్తున్న భూమిపై తనకు హక్కులు ఉన్నట్టు చెబుతున్నారని, ఈ విషయాన్ని అధికారులు తేల్చాల్సి ఉందన్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు న్యాయం చేయాలని వారు కోరారు.

26 నుంచి సీపీఐ మహాసభలు

రాజాం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో ఈనెల 26, 27 తేదీలలో జరుగనున్న సీపీఐ జిల్లా 14వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణమూర్తి కోరారు. ఈ మేరకు మంగళవారం రాజాం పట్టణంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, సహాయ కార్యదర్శి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్ర సంక్షేమం

- ‘సుపరిపాలనలో తొలి అడుగు’లో పాల్గొన్న ఎమ్మెల్యేలు

కూటమి పాలనలోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యేలు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని జిల్లాలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వారు పాల్గొని, పథకాలపై వివరించారు.

● భోగాపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. ముంజేరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించారు. రీజనల్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరెడ్డి. ఎంపీటీసీ పిడుగు సత్యం, పిడుగు తోటారావు తదితరులు పాల్గొన్నారు.

● రాజాం: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మంగళవారం పొగిరి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రభుత్వ పథకాలను వివరించారు. నాయకులు పాల్గొన్నారు.

● విజయనగరం రూరల్: ఏడాదిలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, రానున్న నాలుగేళ్లలో ఎంతో అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. నగరం లోని 48, 49, 50 డివిజన్‌లోనూ, మండల పరిధిలోని ద్వారపూడిలోనూ మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● గుర్ల: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కమిడి కళావెంకటరావు అన్నారు. రాగోలు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడు గు కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. వర్షాన్ని కూడా లెక్కచేయకుండా గొడుగులు వేసుకొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం సీసీ రోడ్డును ప్రారంభించారు. టీడీపీ నాయకులు వెన్నె సన్యాసినాయుడు, తిరుమలరాజు కిరణ్‌కుమార్, మండల అప్పలనాయుడు, దాసరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● శృంగవరపుకోట రూరల్: రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నిస్వార్థమైన పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సీతారాంపురంలో టీడీపీ నాయకుడు డోకుల అచ్చెంనా యుడు ఆధ్వర్యంలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.


విజయనగరం రూరల్: ప్రచారంలో ఎమ్మెల్యే అదితి


ఎస్.కోట రూరల్: సీతారాంపురంలో ఎమ్మెల్యే లలితకుమారి


రాజాం: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు


భోగాపురం: కరపత్రాలు పంపిణీ చేస్తున్న బంగార్రాజు


గుర్ల: వర్షంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కళా

అధికారం కోసం జగన్ కుట్ర

- ఎమ్మెల్యే కళా వెంకటరావు

రాజాం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అధికారం కోసం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి భారీ కుట్రలు చేస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు ఆరోపించారు. మంగళవారం రాజాం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేర్ని నాని మాట్లాడే భాష. ప్రభుత్వంపై విమర్శించే పదజాలం చూస్తుంటే రాష్ట్రంలో ఏదో పెద్ద కుట్రకి వైసీపీ సన్నాహం అవుతున్నట్టు అనుమానం వస్తోందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టీడీపీ నాయకుడు టంకాల వెంకటేషం ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ ప్రాంతంలో ఉన్న మూడు విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈ పి.త్రినాథరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజాం ఫీడర్‌కు సంబంధించి, ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయం వద్ద ఏపీ స్విచ్ ఏర్పాటు చేయాల్సి ఉన్నందున రాజాం ఫీడర్‌లో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందన్నారు. ఈ పనుల వల్ల మండలంలోని రామలింగపురం, మెట్టపల్లి, అలజంగి, కర్లాం, కరకాం, పాలవలస, నిమ్మలవలస, పెదనడిపల్లి గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

సహకార రంగంలో అభివృద్ధిపై శిక్షణ

విజయనగరం రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సహకార రంగంలో వచ్చే మార్పులను అధ్యయనం చేసేందుకు రాష్ట్రంలో నూతనంగా నియమితులైన 13 జిల్లాల డీసీసీబీ చైర్మన్‌లకు లక్నోలో ఈనెల 14 నుంచి మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. బ్యాంకర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణలో డీసీసీబీ చైర్మన్ నాగార్జున నాగార్జున పాల్గొన్నారు. లక్నోలోని ప్రముఖ చేపల జన్యు పరిశోధన సంస్థని సందర్శించారు.

అశోక్‌కు అభినందనలు

భోగాపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్రానికి గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజును ఎమ్మెల్యే లోకం నాగమాధవి మంగళవారం విజయనగరంలో ఆయన బంగ్లాలో మర్యాద పూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. ఆమెతో పాటు నాయకుడు పల్లంట్ల జగదీష్ ఉన్నారు. ● శృంగవరపుకోట రూరల్: గోవా గవర్నర్‌గా నియామితులైన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజుకు డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్ ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు.

● రాజాం, జూలై 15(ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజును ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆయన నివాసంలో మంగళవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవ చేసిన వ్యక్తి అశోక్ గజపతిరాజు అని కొనియాడారు. ఆయన వెంట పలువురు కూటమి నాయకులు ఉన్నారు.


భోగాపురం: అశోక్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి


అశోక్‌ను సత్కరిస్తున్న గొంప కృష్ణ

మైన్స్ లీజును పునరుద్ధరించాలి

గరివిడి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సదానందపురం, దేవాడ మైన్స్ లీజును పునరుద్ధరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును రాజాంలో తన ఇంటి వద్ద మంగళవారం కలిసి, వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఈ మైన్స్ లీజు సెప్టెంబరు 14తో పూర్తయిందని తెలిపారు. దీంతో సెప్టెంబరు 15 నుంచి మైన్స్‌లో పనిచేస్తున్న 503 మంది రెగ్యులర్ కార్మికులని తొలగిస్తామని యాజమాన్యం నోటీసులు ఇచ్చిందని చెప్పారు. మైన్స్ లీజు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టీవీ రమణ, యూనియన్ గౌరవ అధ్యక్షుడు విశ్వనాథరాజు, అధ్యక్షుడు గౌరినాయుడు, ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు, యూనియన్ నాయకులు సన్యాసినాయుడు, సాంబ, రమణ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎన్నికలు ఏకగ్రీవం

గజపతినగరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ యూనియన్ నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గజపతినగరం తాలూకా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. కర్రోతు రాజ్‌కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ఎస్.రాజశేఖర్, కార్యదర్శిగా ఎంవీఆర్ సన్యాసిరావు, సహాయ కార్యదర్శిగా ప్రసాదరావు, కోశాధికారిగా ఆర్.నవీన్‌కుమార్ ఎన్నికయ్యారు.

నిరసన దీక్షకు అనుమతి ఇవ్వండి

శృంగవరపుకోట రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిందాల్ యాజమాన్యం నుంచి రావాల్సిన హక్కుల కోసం హరిజన, గిరిజన నిర్వాసిత రైతులు శాంతియుతంగా పోరాటం చేస్తుంటే వారిపై పలు శాఖల అధికారులు అణిచివేత ధోరణి అవలంబిస్తున్నాయని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఈ మేరకు అమరావతిలో జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి శ్యాంసుందర్‌ను కలిసి, సమస్యను వివరించారు. 2008 జిందాల్ భూముల సేకరణ నుంచి నేటివరకు జరుగుతున్న పరిస్థితులు, నిర్వాసితులకు రావాల్సిన న్యాయపరమైన హామీలతో పాటు వారిపై పోలీస్‌శాఖ బెదిరింపులు, ఇతర అధికారులు భయభ్రాంతులకు గురిచేయడం వంటి అంశాలను ఆధారాలతో ఆయనకు నివేదిక అందించారు. అదేవిధంగా రాజ్యాంగ హక్కుల ప్రకారం నిర్వాసితులకు నిరసన దీక్షకు అనుమతులు ఇప్పించాలని కోరారు. దీనిపై కమిషన్ సభ్యుడు సానుకూలంగా స్పందించినట్టు ఆయన తెలిపారు.

పోలీసులకు దరఖాస్తు

శృంగవరపుకోట, జూలై 15(ఆంధ్రజ్యోతి): నిరసన దీక్షకు అనుమతి ఇవ్వాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ రమణకు దరఖాస్తు అందించారు. తాను జిందాల్ బాధితుడినని, తన భూములు పరిశ్రమకు ఇచ్చామని, అయితే 18 ఏళ్లు అయినా పరిశ్రమ రాలేదని దీని కోసం ఇప్పటికే జిందాల్ నిర్వాసితులు 24రోజులుగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. తమకు నిరసన దీక్ష చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం సెక్షన్ 30 అమల్లో ఉందని సీఐ చెప్పడంతో, దీనిని అనుసరించి తమ శాంతియుత నిరసన దీక్షకు అనుమతి ఇవ్వాలని ఆయన కోరారు.


జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యునితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

గజపతినగరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం- దేశం కోసం అనే నినాదంతో స్థానిక న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కోర్టు నుంచి జాతీయ రహదారి మీదుగా అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వంతో కేసులను పరిష్కారం చేసుకోవాలని సూచించారు. న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

● రాజాం రూరల్: మధ్యవర్తిత్వంతో అన్నిరకాల కేసులు పరిష్కారం అవుతాయని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ స్పష్టం చేశారు. జూనియర్ న్యాయాధికారి నైమిషతో కలిసి కోర్టు ప్రాంగణం నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకూ ప్లకార్డులతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, ఎక్సైజ్ సీఐ జైభీం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాజాం శాఖ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్ కుమార్, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

● శృంగవరపుకోట: ఎస్.కోటలో స్థానిక కోర్టు న్యాయాధికారి బి.కనకలక్ష్మి ఆధ్వర్యంలో న్యాయవాదుల ఆధ్వర్యంలో మంగళవారం ‘మధ్యవర్తిత్వం-దేశంకోసం’ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట బార్ అసోషియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.



గజపతినగరం: ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారి విజయ్‌రాజ్‌కుమార్

ప్రాణం పోయినా గ్రామం విడిచేదిలేదు

- అదానీ ప్రతినిధులను అడ్డుకున్న మారిక గిరిజనులు

వేపాడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రాణం పోయినా సరే తమ గ్రామం వదిలి వెళ్లేది లేదని మారిక గిరిజనులు స్పష్టం చేశారు. తమ గ్రామానికి వచ్చిన అదానీ కంపెనీ ప్రతినిధులు, రెవెన్యూ అధికారులను సీపీఎం నాయకుడు చలుమూరి శ్యామ్ ఆధ్వర్యంలో ప్రతిఘటించారు. తమ గ్రామంలో అదానీ కంపెనీ పెట్టవద్దని తెగేసి చెప్పారు. మారిక అడవితల్లిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమ పొట్టలు కొట్టొద్దని, మారిక కొండపై ఆదానీ పవర్ ప్లాంట్ పెట్టొద్దని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కూడా అదానీ కంపెనీ కోసం అమాయక గిరిజనుల భూములను దౌర్జన్యంగా తీసుకునేందుకు ప్రయత్నించడం ఘోరమన్నారు. సీపీఎం నాయకుడు చలుమూరి శ్యామ్, గిరిజన నాయకుడు జాలారి వీర్రాజు, గమ్మెల బాబూరావు, సోమేష్, అప్పలనాయుడు, కరకవలస సర్పంచ్ పెంటమ్మల సారథ్యంలో రహదారికి అడ్డంగా బ్యానర్‌తో అడ్డంగా కంచె వేసి అడ్డుగా నిల్చొని ఆదానీ కంపెనీ ప్రతినిధులను, అధికారులను అడ్డుకున్నారు. ఈసందర్భంగా సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ మాట్లాడుతూ కష్టంలో రాజకీయ పార్టీలైన వైసీపీ, తెలుగు దేశం, జనసేన పార్టీలు తమకు మద్దతు ఇవ్వకుండా ఉండడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న గిరిజనులు

పిచ్చికుక్క స్వైర విహారం

- పలువురికి గాయాలు

రేగిడి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబఖండి గ్రామంలో మంగళవారం రాత్రి పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామంలో వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోగా, ఆ సమయంలో ఓ పిచ్చికుక్క కనబడినవారిందరిపై దాడి చేసింది. ఈ దాడిలో పప్పల అచ్యుతరావు, సిరిపురపు రాధాకృష్ణ, కుప్పలి ప్రసాద్, రాము తదితరులు గాయపడ్డారు. మనుషులు, పశువులు అని తేడా లేకుండా వెంబడించి దాడికి దిగినట్టు గ్రామస్థులు తెలిపారు. గాయపడ్డవారిని కుటుంబీకులు రాజాంలోని బూరాడ ఆసుపత్రికి తరలించారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

చెరువులో చేపలు మృత్యువాత

దత్తిరాజేరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తి గ్రామ రెవెన్యూ పరిధిలో గల పాచిబంద చెరువులో వందల సంఖ్యలో చేపలు మంగళవారం మృతిచెందాయి. దీంతో ఆ చెరువును లీజు తీసుకుని, చేపలు పెంచుతున్న పొట్నూరు ఈశ్వరరావు లబోదిబోమంటున్నారు. నాలుగు పైసలు చేతికి అందుతాయనే సమయంలో ఎవరో తెలియని వారు విషప్రయోగం చేయడంతో చెరువులో చేపలు మొత్తం చనిపోయాయని విలపించారు. సుమారు లక్ష రూపాయలపైన నష్టం వాటిల్లిందని చెప్పారు. పెదమానాపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


మృతిచెందిన చేపలు

కొట్లాటలో ఒకరికి గాయాలు

నెల్లిమర్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొయిదనారాయణపట్నంలో మంగళవారం ఇద్దరి మధ్య జరిగిన కొట్లాటలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన పతివాడ అచ్చెంనాయుడు, సామంతుల రమణల మధ్య మంగళవారం తమ పొలంలో జరిగిన ఘర్షణ కొట్లాటకు దారి తీసింది. ఈ కొట్లాటలో అచ్చెంనాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం అచ్చెంనాయుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇద్దరు పరస్పరం నెల్లిమర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూడు దుకాణాల సీజ్

శృంగవరపుకోట, జూలై 15(ఆంధ్రజ్యోతి): గత కొద్ది సంవత్సరాలుగా పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దెకు ఉంటూ బకాయిలు చెల్లించని మూడు దుకాణాలను పంచాయతీ ఈవో అనురాధ సీజ్ చేయించారు. మంగళవారం సాయంత్రం పంచాయతీ సిబ్బందితో వెళ్లి షాపులకు తాళాలు వేయించడంతో పాటు సీజ్ చేయించారు. ప్రతిఒక్కరూ సకాలంలో అద్దెలు చెల్లించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు.

శాంతియుతంగా పోరాటం చేస్తుంటే బైండోవర్ కేసులా?


బైండోవర్ కేసులు పెట్టవద్దని నినాదాలు చేస్తున్న రైతులు

శృంగవరపుకోట రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): గత 24 రోజులుగా జిందాల్ కంపెనీకి భూములు ఇచ్చి మోసపోయిన రైతులు శాంతియుతంగా తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తుంటే వారిని పోలీసులు బెదిరించడం, బైండోవర్ కేసులు నమోదు చేయడం దారుణమని ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక రైతులతో కలిసి నిరసన చేపట్టారు. ఎన్నో సార్లు సీఐ నిరసనకు అనుమతులు ఇవ్వలేదన్నారు. ఇకనుంచి పోలీసులు తమ వేధింపులు ఆపకపోతే మండలంలోని ప్రతి గ్రామంలో ఒక టెంటు వేసి, నిరసన దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ తమకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో ఎమ్మెల్సీ ఇంటి వద్ద కూర్చొని నిరసన చేస్తున్నామని, అయితే కొంతమంది పోలీసులు తమ వద్దకు వచ్చి, నిరసన నుంచి బయటకు వస్తే మీ డబ్బులు ఇప్పిస్తామని.. ఇంకా నిరసన చేస్తే అరెస్టులు చేస్తామని బెదిరింపులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

సోలార్ రూఫ్‌టాప్ మంజూరు చేస్తాం

విజయనగరం రింగురోడ్డు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు రుణ సదుపాయం అమల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పీఎం సూర్యఘర్ పథకంలో సోలార్ రూఫ్‌టాప్‌ను మంజూరు చేస్తామని సోలార్ ఎనర్జీ చీఫ్ జనరల్ మేనేజరు బి.సురేఖారాణి తెలిపారు. మంగళవారం దాసన్నపేటలోని విద్యుత్ భవన్‌లో పీఎం సూర్యఘర్ పథకంపై విద్యుత్ శాఖాధికారులు సోలార్ విక్రయదారులు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూర్యఘర్ పథకం విస్తృత స్థాయిలో అమలు చేసేందుకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఈ లక్ష్మణరావు, లీడ్ మేనేజరు రమణమూర్తి, ఎస్‌బీఐ ఆర్ఎం సురేష్‌బాబు, ఈఈ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ వాలిడేషన్ ఎమెండ్‌మెంట్ రద్దు చేయాలి

విజయనగరం కలెక్టరేట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పింఛన్‌దారులకు నష్టం కలిగించే పెన్షన్ వాలిడేషన్ ఎమెండ్‌మెంట్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దింటి అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పే కమిషన్‌ను అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు సూర్యనారాయణ, వీఎస్ఆర్ నాయుడు, పరుశురాం తదితరులు ఉన్నారు.

మహిళలకు రక్షణగా ‘శక్తి’

విజయనగరం క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణగా శక్తి మొబైల్ యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని అదనపు ఎస్పీ పి.సౌమ్యలత తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో మంగళవారం ఆమె విద్యార్థులకు యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల మొబైల్‌లో శక్తి యాప్ ఉంటే, ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందన్నారు. మహిళా పోలీసుస్టేషన్ సీఐ నర్సింహమూర్తి, ఎస్ఐ శిరిషా, శక్తి యాప్ బృందం పీపీ నాయుడు, లక్ష్మీనారాయణ, అరుణ, అమల పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు

విజయనగరం రింగురోడ్డు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎక్కడైనా రహదారులు, కాలువలు ఆనుకుని ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య హెచ్చరించారు. మంగళవారం ఆయన ఆదేశాలతో ప్రణాళికా విభాగం సిబ్బంది ఆర్అండ్‌బీ జంక్షన్ రహదారి మార్జిన్ ఆనుకుని కాలువలపై బడ్డీలు, చిన్న దుకాణాలను తొలగించారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో అనధికార హోర్డింగులు, ఫ్లెక్సీ బోర్డులను తొలగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర క్రమబద్ధీకరణలో భాగంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఐద్వా జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

విజయనగరం బాబామెట్ట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో వచ్చే నెల 19న జరగనున్న ఐద్వా తొమ్మిదో జిల్లా మహాసభలకు ఐద్వా ప్రతినిధులు, మహిళలు భారీ ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుణ్యవతి, రమణమ్మలు పిలుపునిచ్చారు. మంగళవారం ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఐద్వా ప్రతినిదులు కృష్ణవేణి, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో సమస్యలు ఉన్నాయా?

● పనులను సద్వినియోగం చేసుకోవాలి

● వేతనదారులకు సూచించిన కేంద్ర బృందం

బొబ్బిలి రూరల్, జూలై15 (ఆంధ్రజ్యోతి): ‘ఉపాధి హామీ పథకం అమలులో ఏమైనా సమస్యలు ఉన్నాయా?. వేతనాలు గిట్టుబాటు అవు తున్నాయా? సమస్యలు ఉంటే చెప్పండి. పనులను సద్వినియోగం చేసు కోండి.’ అని ఉపాధి వేతనదారులకు కేంద్ర బృందం సూచించింది. మండలంలోని గోపాలరాయుడుపేట, బట్టివలస, అక్కేనవలస, నారసింహునిపేట, రాజుపేట తదితర గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను కేంద్ర బృందం మంగళవారం పరిశీలించింది. ఏమే పనులకు ఎన్ని నిధులు మంజూరయ్యాయి.. ఎంత ఖర్చు చేశారనే వివరాలపై ఉపాధి పథకం కేంద్ర రీసెర్చ్ ప్రొఫెసర్లు సునీల్ బంట, నాతూసింగ్ ఆరా తీశారు. వేతనదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, ఏపీవో లక్ష్మీపతిరాజు, డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు, ఏపీఎం భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ●గోపాలరాయుడుపేట సచివాలయాన్ని మంగళవారం ఉపాధి హామీ పథకం కేంద్ర రీసెర్చ్ ప్రొఫెసర్లు సునీల్ బంట, నాతూసింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఉపాధి హామీ నిధులతో జరిగిన పనులకు సంబంధించిన దస్త్రాలను సరిచూశారు. ఏయే సమస్యలపై ప్రజల నుంచి ఎక్కువగా సచివాలయానికి ఫిర్యాదు వస్తున్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సచివాలయంలో అందాల్సిన సేవలు మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సచివాలయానికి వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, డీఆర్‌డీఏ అధికారులు, డ్వామా అధికారులు, డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు, మండల ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గోపాలరాయుడుపేటలో గోకులాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయండి

● రూ.7లక్షల నష్టపరిహారం ప్రకటించిన స్కూల్ యాజమాన్యం



ఆందోళన చేస్తున్న బాలుడి కుటుంబ సభ్యులు తదితరులు

బొబ్బిలి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రావువారివీధికి చెందిన విద్యార్థి సుందరాడ కార్తికేయ (14) కుటుంబానికి న్యాయం చేయాలని అంబేడ్కర్ పోరాట సమితి అధ్యక్షుడు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ముందు మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. సోమవారం సాయంత్రం తోటి విద్యార్థి జరిపిన దాడి కారణంగా తొమ్మిదో తరగతి విద్యార్థి కార్తికేయ మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమ శిక్షణ తప్పి ఇలాంటి హింసాత్మక చర్యలకు పాల్పడుతుండడం సమర్థనీయం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖాధికారులను, స్కూల్ యాజమాన్యం ప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. దీంతో కొంత మంది పట్టణ పెద్దలు రంగంలోకి దిగి సంబంధిత స్కూల్ చైర్మన్ ఎంకే నాయుడు (నాని) తదితరులతో సంప్రదింపులు జరిపారు. విద్యార్థి మృతి ఘటనకు స్కూల్ యాజమాన్యానికి ఎటువంటి సంబంధం లేనప్పటికీ, మానవతా దృక్పథంతో ఆ పేద కుటుంబాన్ని ఆదుకోవాలన్న సదుద్దేశంతో రూ.7లక్షల పరిహారం చెల్లించేందుకు సమ్మతించారు. మృతుడి చెల్లెలు చదువుకునేందుకు సహకారం అందిస్తామని తెలిపారు. దీంతో ఆందోళన సద్దు మణిగింది. ●ఇదిలా ఉండగా డిప్యూటీ డీఈవో మోహనరావు మంగళవారం స్థానిక డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ సతీష్‌కుమార్‌తో చర్చలు జరిపారు. దర్యాప్తు జరిపి తమ అధికారులకు నివేదికను అందజేశారు. కార్తికేయ మృతదేహానికి మంగళవారం స్థానిక సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు. కార్తికేయ మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతికి కారకుడైన సహ విద్యార్థిని అదుపులోకి తీసుకొని చట ప్రకారం జువైనల్ హోమ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

స్వామీ.. ఇంత దైన్యమేమి?

(మూడో పేజీ తరువాయి)

దివంగత బొబ్బిలి రాజా ఆర్‌వీజీకే రంగారావు వ్యవహరించేవారు. ఆయన ఆధ్వర్యంలో ఆలయానికి వైభవాన్ని తెచ్చేందుకు తన చిన్న తనయుడైన బేబీనాయనను విశేషంగా ప్రోత్సహించేవారు. అన్న సహకారంతో బేబీనాయన తన సొంత నిధులను వెచ్చించి ఆలయానికి మరమ్మతులు చేయించడమే కాక ఆధ్యాత్మిక కార్య క్రమాలను నిర్వహిస్తున్నారు. వీటిలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా చేపట్టే పూలంగి సేవ చెప్పుకోదగ్గది. ఆర్వీజీకే రంగారావు హయాంలో స్వామికి చెందిన 120 కిలోల వెండిని విక్రయించి తద్వారా వచ్చిన రూ.7.50 లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేయించారు. అలాగే ఆయన హయాంలో ఓసారి, సుజయ్‌కృష్ణరంగారావు హయాంలో మరోసారి బ్యాంకులో ఉన్న స్వామివారి విలువైన ఆభరణాలను ప్రజల సందర్శనార్థం ఉంచి మళ్లీ బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఆలయానికి సంబంధించిన భూముల లెక్క తేల్చి స్వామికి అప్పగించాలని ఎమ్మెల్యే బేబీనాయన ప్రభుత్వాన్ని లిఖితపూర్వకంగా పలుదఫాలు కోరారు.

ఆ భూముల చిరునామా ఎక్కడో?

మొకాసాకొత్తవలసలో 1.585 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లా పద్మాపురంలో 1.32 ఎకరాలు, రామంపేటలో 9 ఎకరాలు, మల్లిీడులో 2.40 ఎకరాలు, వాటపాగులో 30 ఎకరాలు ఆలయానికి ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. వాటి చిరునామా ఎవరికీ తెలియని పరిస్థితి. రాజులకు బంధువైన రిటైర్డ్ పోలీసు అధికారి ఆ భూములపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి రికార్డులన్నింటినీ వెలికితీయించి స్వామివారికి ఇన్ని భూములున్నాయని తెలుసుకోగలిగారు. కానీ ఆ భూములన్నీ భౌతికంగా ఎక్కడున్నాయో అధికార యంత్రాంగం కనుగొనలేకపోతోంది.

భూములు గుర్తించేందుకు కసరత్తు..

అన్యాక్రాంతంలో ఉన్న భూములపై చర్యలు తీసుకునేందుకు తమ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. స్వామికి బాలభోగం, రాజభోగం సేవలు, నూనె, కరెంటు బిల్లులు కలిపి ఏడాదికి సుమారు 10 లక్షల రూపాయల మేర ఖర్చు అవుతుంది. అనువంశిక ధర్మకర్తల నిర్ణయం మేరకు ప్రతీ రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఉచిత దర్శనం ఉంటుంది. భూముల సమస్య తీరితే ఆలయ అభివృద్ధి బాగుంటుంది. ఎమ్మెల్యే బేబీనాయన ఆదరణతో ఆలయలో పలురకాల ఆధ్యాత్మిక కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయి.

-లక్ష్మణరావు, ఆలయ ఈవో

ఆ మూడింటితో అవస్థలే

(మూడో పేజీ తరువాయి)

ఉండేది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ గెడ్డ కాలువకు ఇరువైపుల ఉన్న నివాసితులు వాడుక నీరు, చెత్త, మరుగుదొడ్ల అవుట్‌లెట్‌లను నేరుగా వదిలేశారు. అనేక రకాల వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇప్పుడు చూసిన వారెవరైనా మురుగు కాలువనుకుంటున్నారు. పదేళ్ల కిందట ఈ కాలువ శుద్ధి కోసం రూ.2.30 కోట్లు అవసరమని జలవనరుల శాఖ అంచనా వేయగా విషయాన్ని అప్పటి సీఎం నారా చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యేగా ఉన్న కోళ్ల లలితకుమారి వివరించారు. నిధులు మంజూరైనప్పటికీ అవి చాలవని కాంట్రాక్టర్ పని మొదలు పెట్టలేదు. అంతలో ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారిపోవడంతో సమస్య అలాగే ఉండిపోయింది.

● సాయిబాబా ఆలయం వద్ద ఉన్న కుళ్లీకోనేరు ఒకప్పుడు 150 ఎకరాలకు సాగునీరి అందించేది. ఇప్పుడది మురుగుతో నిండి ఉంది. దీనికి ఆనుకొని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, బీసీ వసతి గృహం ఉన్నాయి. ఓ ప్రైవేటు నర్సింగ్ హోమ్, పలు నివాసాలున్నాయి.. పట్టణంలో పెద్ద కాలనీగా గుర్తింపు పొందిన శ్రీనివాస కాలనీలోని వాడక నీరంతా ఇందులోనే కలుస్తోంది. కోనేరు సమీపంలో ఉన్న వారంతా అక్కడి దుర్గంధానికి నరకయాతన పడుతున్నారు.

● విశాఖ-అరకు రోడ్డుకు ఆనుకుని ఉన్న పలు వ్యాపార, వాణిజ్య సముదాయాల యజమానులు వరద నీరు పారే కాలువను ఆక్రమించారు. దీంతో నీరు పోయేందుకు మార్గాలు మూసుకుపోయాయి. వర్షం పడినప్పుడల్లా విశాఖ-అరకు రోడ్డుపైకి వరద నీరు వచ్చేస్తోంది. ఈ మూడు సమస్యలకు పరిష్కారం దొరికితే తప్ప ఎస్.కోటలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రకు చోటుండదు.

ఇంటి ప్లాన్‌కు లంచం

(మూడో పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా కమిషనర్ తారక్‌నాథ్‌ను పట్టుకున్నారు. కేసు నమోదు చేశామని, బుధవారం కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు.

ఆది నుంచీ ఆయనపై ఆరోపణలు

నగర పంచాయతీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తారక్‌నాథ్‌పై ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలో నిర్మాణంలో ఉన్న ప్రతి భవనం వద్దకు వెళ్లి లంచాలు డిమాండ్ చేస్తునట్లు విమర్శలు ఉన్నాయి. ఇదే విషయాన్ని గత మూడు దఫాలుగా జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు ప్రస్తావించారు. ఒకానొక సందర్భంలో బాధితులతోనే నేరుగా సమావేశాల్లో చెప్పించారు. అయినా సరే కమిషనర్ తీరులో ఏ మాత్రం మార్పు రాలేదు. అంతా సవ్యంగా జరిగితే ఈ నెలాఖరుకు ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఇంతలోనే ఏసీబీ అధికారులకు పట్టుబడడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

విశ్వసనీయత.. నిబద్ధత

(మూడో పేజీ తరువాయి)

టీడీపీ అభ్యర్థిగా విజయనగరం నుంచి పోటీచేసి గెలిచారు. ఆయన సోదరుడు ఆనందగజపతిరాజు విశాఖ జిల్లా భీమిలి నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. తొలిసారిగా అశోక్ ఎన్టీఆర్ కేబినెట్‌లో వాణిజ్య పన్నుల శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. 1985 ఎన్నికల్లో తిరిగి టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించారు. ఈసారి కూడా వాణిజ్యపన్నుల శాఖ మంత్రిగా పనిచేశారు. 1989 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన ఆయన విజయం సాధించారు కానీ రాష్ట్రంలో టీడీపీ ఓడిపోయింది. అయినా ఐదేళ్ల పాటు ప్రతిపక్షపాత్రలో తన వాణి వినిపించారు. 1994లో గెలిచిన అశోక్ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా, 1995లో ఆర్థిక శాఖ మంత్రిగా కూడా వ్యవహరించారు. 2004లో మాత్రం టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన అశోక్‌పై కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన కోలగట్ల వీరభద్రస్వామి విజయం సాధించారు. 2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి అదే కోలగట్ల వీరభద్రస్వామిపై గెలుపొందారు అశోక్. 2014 ఎన్నికల్లో అధినేత చంద్రబాబు సూచన మేరకు విజయనగరం ఎంపీగా పోటీచేసి గెలిచారు. మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో కీలకమైన పౌరవిమానయానశాఖ మంత్రిగా పదవి చేపట్టారు. 2018లో టీడీపీ.. ఎన్డీఏ నుంచి బయటకు రావడంతో కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేశారు. 2019 ఎన్నికల్లో మరోసారి ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్నారు. కుమార్తె అదితి గజపతిరాజు విజయనగరం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

ప్రతి నిర్మాణం వెనుక ఆయనే..

జిల్లా అభివృద్ధిలో అశోక్ పాత్ర ఉంది. ఆయన మంత్రిగా ఉన్నప్పుడే కలెక్టరేట్ నిర్మాణం జరిగింది. బొబ్బిలి గ్రోత్ సెంటర్ ప్రాజెక్టు ఏర్పాటు ఆయన చొరవే. 1995లో ఎన్టీఆర్ ప్రజల వద్దకు పాలన కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఆ సమయంలో అశోక్ విన్నపంతో రాష్ట్ర మంత్రివర్గంతో పాటు యంత్రాంగం జిల్లాకు వచ్చింది. బహిరంగ ప్రదేశంలోనే శాఖల వారీగా సమస్యలను, విన్నపాలను ప్రజల నుంచి తీసుకున్నారు. విజయనగరంలో ‘సంతకాల వంతెన’గా పిలిచే ఎత్తురాళ్ల బ్రిడ్జి అశోక్ చొరవతోనే నిర్మితమైంది. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం 8వేల మందితో సంతకాలు చేపట్టి కేంద్రానికి పంపడంతో ప్రభుత్వం స్పందించింది. విజయనగరంలో ఎత్తుబ్రిడ్జి నిర్మాణం జరిగింది. అశోక్ గజపతిరాజు విజయనగరం మండలం ద్వారపూడిని దత్తత తీసుకున్నారు. ఆ గ్రామం రూపురేఖలనే మార్చేశారు. మరోవైపు కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు విజయనగరం లోక్‌సభ పరిధిలో అక్షరాస్యతను పెంపొందించేందుకు చిట్టిగురువులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అది విజయవంతమైంది. తాను నిర్వర్తించిన పౌర విమానయాన శాఖతో జిల్లాకు ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. అదే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం. 2014లో పౌర విమానాయాన శాఖ బాధ్యతలు చేపట్టిన అశోక్.. విభజన హామీల్లో భాగంగా ఏపీకి అంతర్జాతీయ విమానాశ్రయం తెచ్చారు. అప్పటి సీఎం చంద్రబాబును ఒప్పించి భోగాపురానికి విమానాశ్రయాన్ని కేటాయించేలా చేశారు. జాతీయ రహదారులు, వ్యవసాయం, తాగునీటి కోసం వేలాది కోట్లు మంజూరు చేయించిన ఘనత ఆయనదే.

దివ్యాంగుల అభివృద్ధికి సహకరించండి

రామభద్రపురం, జూలై15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ చేయూత అందివ్వాలని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ శతపతి అన్నపూర్ణ కోరారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో రెహస్వీన్-సీడీసీ ఆధ్వర్యంలో దివ్యాంగుల సంఘ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో తోడ్పాటునందిస్తోందన్నారు. వాటిని వినియోగించుకుని దివ్యాంగులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. దివ్యాంగులు కూడా అన్ని రంగాల్లో ప్రస్తుతం పోటీపడుతున్నారని, వారిని మరింతగా ప్రోత్సహించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వంగపండు గోపాలనాయుడు, సామాజిక కార్యకర్తలు బొంతలకోటి శంకరరావు, డోకల రవికుమార్, త్రినాథ, దివ్యాంగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీసీ ప్రాజెక్టు డైరెక్టర్ శతపతి అన్నపూర్ణ

అదనంగా 28 పోలింగ్‌బూత్‌లు

●రాజకీయ పక్షాల సమావేశంలో ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి, జూలై15 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రంలో 1200 మంది ఓటర్లు దాటితే అదనంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీవో రామ్మోహనరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన రాజకీయపక్షాల సమావేశం నిర్వహించారు. బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం ఉన్న 264 పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో 28 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. సమావేశంలో తహసీల్దార్లు ఎం.శ్రీను, ఎన్నికల డీటీ బలివాడ గౌరీశంకర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహనరావు

ఓటర్లతో గౌరవప్రదంగా వ్యవహరించాలి

బొబ్బిలి రూరల్, జూలై15 (ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి అధికారులు ఓటర్లతో గౌరవప్రదంగా వ్యవహరించాలని బాడంగి తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. బొబ్బిలి మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం బూత్ స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ అందరు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి అర్హులైన ఓటర్ల నుంచి ఫారం-6, చనిపోయిన, శాశ్వత బదిలీలు, శాశ్వత వలసల వారి నుంచి ఫారం-7, జాబితాలో సవరణలకు ఫారం-8 స్వీకరించాలన్నారు. అనంతరం పలువురు బీఎల్‌వోలకు భాగస్వామ్యపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీటీ బలివాడ గౌరీశంకరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించాలి

● డీఈవో మాణిక్యాలనాయుడు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో మాణిక్యాలనాయుడు

బొబ్బిలి రూరల్, జూలై15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ నేర్పించాలని డీఈవో జి.మాణిక్యాలనాయుడు అన్నారు. మండలంలోని పిరిడి జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, సదుపాయాలు, బోధన పద్ధతులు, విద్యార్థుల అభ్యాసన తదితర అంశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ.. సాయంత్రం అన్ని తరగతులకు స్టడీ అవర్స్ రైటింగ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ తరగతులు నిర్వహించాలన్నారు. డిసిప్లిన్ మెయింటైన్ చేయమని ఉపాధ్యాయులకు సూచించారు. లేదంటే చర్యలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం హెచ్‌ఎం, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధుసూదనరావు, పీడీ ఎన్.వెంకటనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

బొబ్బిలి రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామని ఎంపీడీవో రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సీహెచ్.బొడ్డవలస, చింతాడ సచివాలయాల్లో, 17, 18 తేదీల్లో కోమటిపల్లి, దిబ్బగుడ్డివలస గ్రామ సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నానో యూరియాను వినియోగించాలి

బొబ్బిలి రూరల్, జూలై15 (ఆంధ్రజ్యోతి): అలజంగిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల యాజమాన్యంపై ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ రైతులకు అవగాహన కల్పించారు. రైతులు నానో యూరియాను వినియోగించాలని సూచించారు. ప్రస్తుత పంటల్లో మొదటిదఫా డీఏపీ, యూరియా వాడాలన్నారు. రెండోదఫా ద్రవరూపంలోని నానో యూరియాను ఎకరానికి అర లీటరు చొప్పున వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పెంట లత, వేణుగోపాల్, రైతులు పాల్గొన్నారు.

అశోక్‌కు బేబీనాయన అభినందనలు



అశోక్‌గజపతిరాజును అభినందిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, జూలై 15 (ఆంధ్రజ్యోతి):గోవా గవర్నర్‌గా నియమితులైన సీనియర్ నేత, కేంద్ర మాజీమంత్రి అశోక్‌గజపతిరాజును మంగళవారం సాయంత్రం ఆయన నివాసంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్ పదవికి హుందాతనం తెచ్చే వ్యక్తిత్వం అశోక్ గజపతిరాజు సొంతమని బేబీనాయన కొనియాడారు.

కూటమితోనే సుస్థిర పాలన

గరుగుబిల్లి, జూలై15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సుస్థిర పాలన సాధ్యమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని రావుపల్లిలో పార్టీ ప్రతినిధులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. ఏడాది పాలనలో హామీలు అమలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రాపు పురుషోత్తంనాయుడు, అరకు టీడీపీ బీసీ విభాగం అధ్యక్షుడు, సంతోషపురం సర్పంచ్ అంబటి రాంబాబు, ఎం.తవిటినాయుడు, ఎం.సింహాచలం నాయుడు, బి.సత్యనారాయణ, జి.అన్నపూర్ణ, వై.శ్రీనివాసరావు, పి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



సమస్యలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే

పార్వతీపురం, జూలై15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను మంగళవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కలిశారు. పార్వతీపురం నియోజకవర్గంలో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పార్వతీపురంలో నిర్మాణంలో ఉన్న మల్టీ స్పెషాలిటీ త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఆశా వర్కర్లను అదనంగా నియమించడం, పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందిని నియమించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన

కురుపాం, జూలై15 (ఆంధ్రజ్యోతి): కురుపాం కోర్టు ఆవరణలో బుధవారం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తత్వం-దేశం కోసం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లోక్ అదాలత్ సభ్యుడు గొటారి వెంకటరావు, పారా లీగల్ వలంటీర్ అంధవరపు కోటేశ్వరరావు, న్యాయ సేవాధికార సంస్థ మండల సిబ్బంది పాలకొల్లు శ్రీనివాస్.. కక్షిదారులకు మధ్యవర్తిత్వం, రాజీపై అవగాహన కల్పించారు.

శతశాతం పోస్టులు గిరిజనులకే కేటాయించాలి

పార్వతీపురం, జూలై15 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ఏరియాలో శతశాతం ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులకు కేటాయించాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో గిరిమిత్ర సమావేశ మందిరంలో గిరిజన సంఘాల నాయకులతో ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల నాయ కులు మాటా్ డుతూ షెడ్యూల్ ఏరియాలోని ఉపాధ్యాయ పోస్టులు జీవో నెంబరు 3 తరహాలో గిరిజనులకు కేటాయించాలని కోరారు. సమావేశంలో గిరి జన సం ఘాల నాయకుడు నిమ్మక జయరాజు, పాలక రంజిత్‌కుమార్, జలుమూరు మణికుమార్, పళ్ల సురేష్, కాడంగి సాయిబాబా, రామకృష, ఆరిక చంద్రశేఖర్, బిడ్డిక తమ్మయ్య ఉన్నారు.

చెవిలో పువ్వులతో కార్మికుల నిరసన

పాలకొండ, జూలై15 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట మూడో రోజు మంగళవారం ఇంజనీరింగ్ కార్మికులు చెవిలో పువ్వులతో నిరసన తెలిపారు. అనంతరం అక్కడే మానవ హారం నిర్వహించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. షరతులు లేకుండా తల్లికి వందనంతో పాటు కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. జి.జెస్సీబాయి, బి.అమరవేణి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ డ్రింకింగ్‌పై డ్రోన్లతో నిఘా

విజయనగరం క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై ఆకస్మికంగా దాడులు నిర్వహించేందుకు డ్రోన్లను విస్తృతంగా వినియోగిస్తున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మంగళవారం సాయంత్రం జామి పోలీసు స్టేషన్ పరిధిలోని అలమండ సంత పరిసరాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. డ్రోన్లు ప్రయోగిం చి మద్యం తాగుతున్న తొమ్మిది మందిని గుర్తించి, అదుపులోకి తీసు కుని వారిపై కేసు నమోదు చేశామన్నారు. నేర నియంత్రణకు, అసాం ఘిక కార్యకలాపాలు నియంత్రణకు, ట్రాఫిక్ నియంత్రణకు డ్రోన్లను విస్తృతంగా వినియోగించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు.

వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్

బొబ్బిలి రూరల్, జూలై15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకం ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలని సిబ్బందిని ఎంపీడీవో రవికుమార్ ఆదేశించారు. మంగళవారం సీతయ్యపేట గ్రామంలో వాటర్ ట్యాంక్ శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించారు. ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం ద్వారా నీటి నాణ్యతను మెరుగుపరచవచ్చన్నారు. అనంతరం గ్రామంలో చెత్త సేకరణ, పారిశుధ్యం నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు, సచివాలయ కార్యదర్శి పార్వతి పాల్గొన్నారు.



సీతయ్యపేటలో క్లోరినేషన్ చేయిస్తున్న ఎంపీడీవో రవికుమార్

ఇద్దరు పీఏసీఎస్ అధ్యక్షుల నియామకం

పార్వతీపురం రూరల్, జూలై15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబొండపల్లి, బందులప్పి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఇద్దరు అధ్యక్షులను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పెద్దబండపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా సూడిగాం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు జి.చంద్రమౌళి నియమితులయ్యారు. ఆయనతో పాటు డైరెక్టర్లుగా చుక్క శ్రీరాములు, బేత కూర్మారావులను నియమించారు. బందులప్పి పీఏసీఎస్ అధ్యక్షుడిగా బోను శ్రావణ్, డైరెక్టర్లుగా నీలాపు సింహాచలం, జక్కు వెంకటరమణ నియమితుల య్యారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కు అధ్యక్షుల తో పాటు డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.